నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మహబూబ్‌నగర్
సోమవారం | జూన్ 24. 2024 | www.navatelangana.com

నేడు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

మహబూబ్ నగర్ : జిల్లాలో గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మహబూబ్ నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా నూతన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లవెల్లి కురుమూర్తి ,వెంకటేష్ గౌడ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాలలోని గ్రామపంచాయతీ సిబ్బంది పెద్ద ఎత్తున నూతన కలెక్టర్ కార్యాలయానికి ధర్నా జయప్రదానికి తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు . ప్రధానంగా మేజర్ గ్రామపంచాయతీలో ఐదారు నెలలు, నూతనంగా ఏర్పడిన (తండాలు) గ్రామపంచాయతీ చేసిన వాటిల్లో ఏడు నెలల నుంచి 12 నెలల వరకు జీతాలు పెండింగ్ ఉన్నాయన్నారు. సబ్బులు ,నూనెలు, పనిముట్లు ,చెప్పులు డ్రస్సులు ఇవ్వడం లేదన్నారు. హెల్త్ చెకప్ కూడా చేయించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రాంటూ ఇవ్వలేదని పేరుతో నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని వారు వాపోయారు.సోమవారం జరిగే ధర్నాకు గ్రామపంచాయతీ సిబ్బంది పెద్ద ఎత్తున తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

పెన్షన్ హామిని కాంగ్రెస్ వెంటనే అమలు చేయాలి

జడ్చర్ల : దివ్యాంగులకు 6 వేల రూపాయల పెన్షన్ హామిని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య ఆదివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్ దివ్యాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్, నారాయణపేట, నాగర్ కర్నూలు జిల్లా వికలాంగుల సమావేశం జరిగింది.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల లో భాగంగా మేము అధికారంలోకి వచ్చిన పిదప వికలాంగులకు 6 ఆరు వేల రూపాయల(పెంచన్) పెన్షన్ ఇస్తామని చెప్పడం జరిగింది. కానీ నేటికీ 6 ఆరు నెలలు కావస్తున్నా నేటికి ఇచ్చిన హామీని నేటికీ నెరవెర్చడం లేదన్నారు.కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య హజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దివ్యంగుల రాష్ట్ర అధ్యక్షుడు కాల జంగయ్య, జాతీయ కార్యదర్శి అంద రాంబాబు, జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, జిల్లా ఇంచార్జి బీచ్యానాయక్, కోకన్వీనర్ సరేందర్, జిల్లా మహిళ అధ్యక్షురాలు పద్మ,అంబేద్కర్ సంగం అధ్యక్షుడు కొంగళి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,లలిత తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన భీమా...చెదిరిన ధీమా

- అమలు కాని కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా
- రైతుబంధు అమలు చేసి బీమాను నిలిపేసిన తెలంగాణ ప్రభుత్వం
- విపత్తు నుంచి కరువైన రక్షణ
- అగ్రికల్చర్ ఇండియన్ కంపెనీకి చెల్లించని ప్రీమియం
- ఇన్సురెన్సూ ఇవ్వని కంపెనీలు

1972 నుంచి నిరంతరంగా అమలు చేస్తున్న పంటల భీమా పథకం ఆరేళ్ల నుంచి ఆగిపోయింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫసల్ బీమా పథకం సైతం తెలంగాణలో అమలు చేయడం లేదు.ప్రకృతి విపత్తులు వచ్చి పంట దిగుబడి తగ్గినా...బీమా ఉంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పరిహారం వస్తోంది. మన రాష్ట్రంలో 2018 నుంచి పెట్టుబడి కోసం రైతు బంధు అమలు చేసిన నాటి నుంచి బీమా పథకాన్ని అమలు చేయడం ఆపేశారు. అగ్రికల్చర్ ఇండియన్ కంపెనీకి ప్రీమియం చెల్లించకపోవడంతో పిడుగులు, అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల వల్ల జరిగిన నష్టానికి భీమా వర్తించడం లేదు. తెలంగాణలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భీమా పథకాన్ని పునరుద్ధరణ చేస్తామని చెబుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పాలమూరు జిల్లాకు ప్రతియేటా ఏదో ఒక రకమైన విపత్తు వస్తుంది. అనావృష్టి, వడగండ్లదెబ్బ, అంతుచిక్కని తెగుళ్లతో పంటలు తుడిచిపెట్టుక పోతాయి. ఇటువంటి విపత్తుల నుంచి రైతులను గట్టెక్కించడానికే భీమా ఉపయోగపడుతుంది. అగ్రికల్చర్ ఇండియన్ ఇన్సూరెన్సు కంపెనీ ద్వారా రైతులకు ఊరట కల్గుతుంది. పంటలకు నష్టం జరిగిన 72 గంటల్లో సంబంధిత అధికారికి సమాచారం ఇస్తే...రైతులకు సహాయం అందుతోంది. ప్రధానమంత్రి ఫసల్ భీమా పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం వంటివి ఇన్సూరెన్సు కంపెనీలు రైతులకు సహాయం అందిస్తున్నాయి.ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1,5 శాతం వాణిజ్య పంటలకు అయితే 5 శాతం రైతులు ప్రీమియం చెల్లించాల్సింది.పంట నష్టాన్ని అంచనావేసి తెగుళ్ల, వడగండ్లు, వరదలతో ముంపు వల్ల జరిగిన నష్టానికి భీమా అందిస్తారు. వరి,మిర్చి,వేరుశనగ,తృన ధాన్యాలు, మినుములు,పెసర,పప్పు దినుసులు, ఉద్యాన వనాలు, మూగ జీవాలైన ఆవులు,గేదెలు చనిపోయాయి. అదేవిధంగా కోళ్లఫారాలలో ఉన్న కోళ్లు చనిపోయినా వారికి ఈ బీమా వర్తిస్తోంది. రైతులకు లాబం చేకూరే ఇటువంటి పథకాలు తెలంగాణ ప్రభుత్వం గత 2018 నుంచి నిలిపేయడంతో రైతులు తీవ్రంగా నష్టాల పాలయ్యారని రైతులు తెలిపారు. సాగు నీటి లభ్యత పెరిగిన తర్వాత ఉమ్మడి జిల్లాలో 22 లక్షల ఎకరాలు ఖరీఫ్‌లో, 10 లక్షల ఎకరాలకు పైగా రబీ లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తారు. ప్రతి ఏటా పంట రుణాలు తీసుకునే సమయంలో, మండల వ్యవసాయ అధికారికి కొంత ప్రీమియం చెల్లిస్తారు.గత ఆరేండ్లుగా ప్రీమియం తీసుకోవడం లేదు పరిహారం లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నోటిఫైడ్ చేసిన పంటలనే సాగు చేయాల్సింది. 2017లో జరిగిన అనావృష్టి వల్ల ఉమ్మడి జిల్లాలో లక్షల ఎకరాలలో పంట నష్టం జరిగింది. ఇందుకోసం బ్యాంకుల ద్వారా భీమా కింద రైతులకు నష్టపరిహారం అందింది. కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేట గ్రామంలో ఉన్న ఆంధ్రబ్యాంకు ద్వారానే రూ.50 లక్షల పరిహారం అందింది.ఈ బ్యాంకు పరిధిలో ఉండే జాజాల, అన్నారం. రఘుపతిపేట, నడిగడ్డ, పోతిరెడ్డిపల్లి, గుండూరు వంటి గ్రామాలకు బీమా వచ్చింది. ఒక నడిగడ్డ గ్రామ రైతులకే సుమారు రూ. 5 లక్షల పరిహారం వచ్చింది. 2018 నుంచి ప్రతియేటా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరుగుతూనే ఉందని రైతులు అన్నారు. అయితే పథకం అమలులో లేక పోవడం వల్ల భీమా రావడం లేదు. 2023 రబీలో పెంట్ల వెల్లి పరిధిలో 50వేల ఎకరాలు నీళ్లలేక వరి,మొక్క, పెసర వంటి పంటలు 100 శాతీం ఎండిపోయాయి. తాడూరు మండలం పుల్జాల, మాల్యాపూర్ గుంత కోడూరు, యాదిరెడ్డిపల్లి పరిధిలో 4 వేల ఎకరాలలో వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలల్లో వివిధ రాకాల పంటలు దెబ్బతిన్నాయని లెక్కలు చెబుతున్నాయి.భీమా సౌకర్యం ఉంటే రైతులకు 100 శాతం పరిహారం వచ్చేది.



పంట ఎండినా..పరిహారం రాలేదు.

నేను రబీలో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వరిపంట సాగుచేశాను. నీళ్లు లేక 100 శాతం ఎండిపోయింది.గతంలో భీమా ప్రీమియం చెల్లిస్తే...పరిహారం వచ్చేది. ఇప్పుడా పరిస్థితుల్లేవు.వేసిన పంటకు నాలుగు లక్షలు అప్పయ్యింది. అప్పులు తీర్చడానికి పట్నం పోవాల్సిన దుస్థితి వచ్చింది.

లింగం, చిన్నంబావి, మండలం నాగర్‌కర్నూల్ జిల్లా

ఇప్పుడు పంట భీమా సౌకర్యం లేదు

వెంకటేశ్వర్లు, జెడీఏ మహబూబ్‌నగర్ జిల్లా

మనకు గత ప్రభుత్వం పంట భీమా నిలిపేసింది. దీంతో పంటలకు ఏదైనా విపత్తు జరిగితే పరిహారం రాదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత భీమా తిరిగి నూతన విధానాలతో అమలు చేస్తామని చెబుతున్నారు.ఇంకా విధి విధానాలు వెలువడలేదు.ఇక్కడ రైతులకు పంట భీమా అమలు కోసం ప్రయత్నం చేస్తాం.



ఆరుగాలం కష్టించి

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి విపత్తు వల్ల రైతులు నిలువునా మునుగుతున్నారు. ప్రకృతి విపత్తుతో పాటు తెగుళ్ల వచ్చి పంట దిగుబడి తగ్గినా.. బీమా వర్తించాలి. బీమా అమలుపై రైతులకు బరోసా సన్నగిల్లుతోంది. పంట నష్టంతో రైతులకు కన్నీరే మిగులుతోంది.ప్రతి ఏటా జిల్లాలో వరితో పాటు వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి,కంది,వేరుశనగ వంటి పంటలు సాగవుతాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో వరి లక్షా 92 వేలు, గద్వాలలో 82 వేలు, వనపర్తిలో 1.87 లక్షలు, నాగర్ కర్నూల్‌లో 2 లక్షల ఎకారాలలో వరిసాగువుతోంది. ప్రతి ఏట వరికి జరిగే నష్టం ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉంటుంది.

కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యం రాజు

దళితుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ- హన్వాడ

రాష్ట్రంలో దళితుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యం రాజు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మొదలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు 75 సంవత్సరాల స్వతంత్రం వచ్చిన దళితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ముఖ్యంగా ఇల్లు తిండి బట్ట విద్యా వైద్యం ముఖ్యమైన ఐదు సమస్యలతో దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు దేశంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యా వైద్యం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిందన్నారు .ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగం మొత్తం కేంద్ర ప్రభుత్వం ప్రవేట్ పరం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ లేకుండా చేస్తుందన్నారు. దేశంలో 10శాతం లేని అగ్రవర్ణాలకు ఈ డబ్ల్యూ సీ పేరుతో రిజర్వేషన్ కేటాయించడం వల్ల విద్యా వైద్య రంగంలో దళితులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దళిత బహుజనులు ఉద్యమించాలని అన్నారు. కేవీపీ ఎస్ మండల అధ్యక్షుడు కంకర రాములు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ నేటికీ దళితులు తిండి,బట్ట ,ఇల్లు లేని వాళ్ళు 50 శాతం మంది ఉన్నారన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితుల బతుకులు మారడం లేదన్నారు.కానీ దళితుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదని అన్నారు. కేవీపీఎస్ ఏర్పడ్డ తర్వాత దళితుల సమస్యల కోసం పోరాడి ఎన్నో విజయాలు సాధించారని గుర్తుచేశారు. భవిష్యత్తులో కేవీపీఎస్ నిర్వహించే పోరాటంలో దళితులు పాల్గొనాలని అన్నారు ఈ జనరల్ బాడీ సమావేశంలో ఎం నర్సింలు, వెంకటయ్య, ఈశ్వరమ్మ, ఏ నర్సింలు, పద్మ ,తదితరులు పాల్గొన్నారు.



దేశంలోని అతిపెద్ద రుణమాఫీ

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే జిఎంఆర్
- మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొత్వాల్

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్

తెలంగాణలో అధికారం చేపట్టిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన ఆమె మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఏకకాల రుణమాఫీ నిర్ణయంతో రైతుల్లో ఆనంద సంబరాలు వెల్లువెరుస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి మల్లికార్జున చౌరస్తాలు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని మరోసారి రుజువయిందని తెలిపారు. మా పార్టీ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిన మాట మెదక్ రాష్ట్రాన్ని ఏర్పాటు కావడం జరిగిందని ఎన్నికల్లో రైతులను కష్టాల నుంచి బయట పడేసేందుకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీ మేరకు ఈ రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 31 లక్షల కోట్ల రూపాయలు రైతుల రుణమాఫీ కోసం ఖర్చు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఇది ఒక చారిత్రాత్మకమైందని తెలిపారు.ఆగస్టు 15వ తేదీ వరకు ఏకకాలంలో రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా మాఫీ అవుతుందని త్వరలోనే జీవో వస్తుందని వారు తెలిపారు.ఈ జిల్లాలో ఉన్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి టిఆర్ఎస్ నాయకులు కళ్ళు లేని కబోతుల్లా రుణమాఫీ పై విమర్శలు చేయడం విడురంగా ఉందని వారు అన్నారు.మంత్రివర్గం ఒక శాసనం చేస్తే అది జీవో రూపంలో వస్తాన కనీస ఇంకిత జ్ఞానం కూడా వీళ్లకు తెలవదా అని ఆయన ప్రశ్నించారు.వారి పరిపాలనలో 10 సంవత్సరాలలో కలిపి వివిధ దశలో కేవలం 20000 కోట్లు మాత్రమే మాఫీ చేసిన విషయం వారు గుర్తు చేశారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా రైతుల పక్షపాతి అని వారు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా రైతుల అభివృద్ధి ధ్యేయంగా ఈ రుణమాఫీ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నదని తెలిపారు. దేశంలోనే ఇది అతి పెద్ద రుణమాఫీ అవుతుందని వారు అన్నారు.



ఎన్డీఏ ప్రభుత్వం రైతుల నష్టం చేసే నల్ల చట్టాలు తెచ్చినప్పుడు కూడా కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేసిందన్నారు. ఈ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందరం అండగా నిలబడాలని పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను త్వరగా తిను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శిలు సంజీవ్ ముదిరాజ్ వినోద్ కుమార్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ మిథున్ రెడ్డి సత్తుల్ చంద్రశేఖర్ గౌడ్ పాడిన అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్ సిరాజ్ కాద్రి తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ : తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం ఇబ్రహీంబాద్ గ్రామ కమిటీ అధ్యక్షులు పేట సత్యారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని అన్నారు గత ప్రభుత్వం రైతులకు విడతలవారీగా రుణమాఫీ చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అసలు వడ్డీ కలిపితే తీసుకున్న పంట రుణానికన్నా వడ్డీ ఎక్కువైందని అన్నారు దీని వల్ల రైతులకు ఎంతో భారమైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకేసారి రుణమాఫీ చేయడం వల్ల రైతులు ఎంతో సంతోషిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు జోగు వాసుఖాతా కృష్ణయ్య ,స్వరూపరెడ్డి, కిష్టయ్య రామస్వామి, వెంకట్ రాములు, ఎర్ర ఆంజనేయులు, సత్తయ్య, వేట అనంతరెడ్డి , పలువురు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ప్రవైట్ కళాశాలల పై నడుస్తున్న హాస్టల్స్ ను తీసివేయాలి

నవ తెలంగాణ... మహబూబ్ నగర్

జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం క్లాసులు నడుస్తున్న ఓ ప్రైవేట్ కళాశాల ముందు ధర్నా చేశారు.. జిల్లా కేంద్రం లో ప్రవైట్ కళాశాలలపై ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టల్స్ నడుపుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజ, ఎన్ఎస్‌యూ ఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారి శ్రీధర్ సుమన్ ప్రవైట్ కళాశాలల యాజమాన్యం దగ్గర 2 లక్షల రూపాయలు లంచం తీసుకొని.కళాశాలలకు మద్దతుగా నిలబడుతున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘాల నాయకులు ఎన్ని సార్లు ఫోన్ చేసిన సమాధానం ఇవ్వకుండా మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడని అన్నారు.హాస్టల్స్ నడుపుకుంటే ఏమైతది అని విద్యార్థి సంఘాలకు సమాధానం చెబుతున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు వస్తున్న సమాచారం తెలుసుకొని 12 గంటలకు తినడానికి పోతున్న అని వెళ్ళిపోయారు. తక్షణమే ప్రవైట్ కళాశాలలకు తొత్తుగా మారిన డిఐఏవో పై శ్రీధర్ సుమన్ పై చర్యలు తీసుకోనీ సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. లేకపోతే కలెక్టర్ ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.



అధికారుల నిర్లక్ష్యం వల్లనే చెంచులపై దాడి

- నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలి
- బాధిత చించు కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కిషన్ నాయక్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

కలెక్టర్ మొదలుకొని ఎస్పి డీఎస్పీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే చెంచులపై దాడి జరిగిందని ఎస్సీ, ఎస్టి, కమిషన్ సభ్యులు కిషన్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లాపూర్ మండలం మొలచింతల పెల్లి గ్రామ చెంచు మహిళపై కొంతమంది దాడి చేసిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా కేంద్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ బాధ్యత కుటుంబాన్ని పరామర్శించింది. ఘటన పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్షరాభాష్యం లేని అమాయక చెంచు మహిళలను ఇలా అసభ్యకరంగా ప్రవర్తించి దాడులు చేయడం అమానవీయమన్నారు. పట్టుకున్న భర్తను అక్క బావలను ఘటన స్థలము నుండి పారదోలి ఒంటరి మహిళపై పశాచికంగా దాడి చేయడం చూస్తుంటే ఇక్కడి అధికారులు ఎలా పనిచేస్తున్నారో అవగతం అవుతుందన్నారు. అన్నలో కారం చల్లి ప్రైవేట్ భాగాలపై డిజిల్ తో కాల్చడం చూస్తుంటే సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. వీరికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీసం సొంత ఇంటిని కూడా నిర్మించి ఇవ్వలేదని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన దొడ్డ నాగమ్మ బండి శివుడు సొంబ సైదమ్మలను సైతం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఎస్పీని ఆదేశించారు. చెంచులకు మహిళలపై ఇక్కడ దాడి జరిగినా వెంటనే ఎస్సీ,ఎస్టీ కమిషనుకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. గతన జరిగి 15 రోజులు కాబోతున్న బాధ్యులను ఇప్పటికీ అరెస్టు చేయకపోవడం పట్ల ఆయన ఆశ్చర్య వ్యక్తం చేశారు. కిషన్ నాయక్ వెంట , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వనజకు ప్రమిలా శక్తి పీఠం సాహితీ పురస్కారం

నవ తెలంగాణ- మహబూబ్‌నగర్

జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత్రి, తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ ప్రమీలా శక్తి పీఠం ఆధ్వర్యంలో సాహితి పురస్కారాన్ని అందుకు న్నారు. హైదరాబాద్, పద్మారావు నగర్ లోని శివానందా శ్రమంలో ఆది వారం జరిగిన ఓ కార్యక్రమంలో సాహితీరంగానికి విశేష సేవలు అందిస్తున్న కవయిత్రి రావూరి వనజకు సంస్థ అధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప ప్రమీలా శక్తి పీఠం విశిష్ట సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వనజకు మెమోంటో ప్రశంసా పత్రంతోపాటు రూ.10వేల నగదు పారితోషికం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త. సినీకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు. బైనదేవదాసు,గూడూరు మహేందర్ రెడ్డి, సత్యమూర్తి, లక్ష్మీనారాయణ, రావూరి కృష్ణ కుమార్, మేకల అనురాధ పాల్గొన్నారు. సాహితీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంలో రావూరి వనజను పలువురు జిల్లా కవులు ప్రశంసించారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ బాలానగర్.

బాలానగర్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో నిధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ఆదివారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి ఆకస్మికంగా విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి. రిటైర్డ్ ఉద్యోగి గిరాప్పతో పనులు ఎలా తీసుకుంటారని ఎమ్మెల్యే మండిపడ్డారు. రిటైర్మెంట్ అయిన వ్యక్తితో విధులు ఎలా నిర్వహిస్తారని ఎమ్మెల్యేమండిపడ్డారు. సెలవు దినం రోజు తలుపులు మూసుకొని విధులు నిర్వహిస్తారా మీకు ఆదేశాలు ఉన్నాయా అని ఎమ్మెల్యే మండిపడ్డారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మామిడి గుట్ట శంకర్ నాయక్. రఫీ బద్రు నాయక్ పాటు పలువురు ఉన్నారు.

సెలవు రోజుల్లో పనిచేయడం మాకు అవసరమా ?
తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి

మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి సెలవుల దినం ఉన్నందున జిల్లా అధికారుల ఆదేశానుసారం తెలియని సమాచారము ఉంటే సీనియర్ రిటైర్డ్ ఉద్యోగులతో సమాచారం తీసుకోవచ్చునని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి వివరణ ఇచ్చారు. విధులు నిర్వహిస్తున్నామని సెలవు రోజుల్లో పనిచేయడం మాకు అవసరమా వివరణ ఇచ్చారు.

అక్కడ గలగల.. ఇక్కడ వెలవెల

- ఖరీఫ్ సీజన్లో వర్షపాతం ఇలా
- నేటికీ చుక్క నీరు రాని చెరువులు కుంటలు.

నవతెలంగాణ- బాలానగర్

బాలానగర్ ఉమ్మడి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో నేటికీ చుక్క వర్షం కురియకపోవటముతో చెరువులలో కుంటలకు చుక్కనీరు రాకపోవడంతో మూగజీవాల సైతం త్రాగునీటికి ఇబ్బంది కలుగుతుంది రైతన్న లో విత్తనాలు రసాయన ఎరువులు తెచ్చుకొని ఇంట్లో పెట్టుకోవడమే జరుగుతుంది సాగు చేయడం మాత్రం జరగటం లేదు ప్రతిరోజు హైదరాబాదులో సాయంత్రం భారీ వర్షాలు కురుస్తున్నాయి పల్లె ప్రాంతాలలో వర్షాలు రాకపోవడంతో చిటపట చినుకులకే పరిమితమవుతుంది. బాలానగర్ ఉమ్మడి మండలంలో . ఐదు నోటిఫైడ్ చెరువులున్నాయి 96 చిన్న తరహా కుంటలు ఉన్నాయి ఇప్పటివరకు చెరువులలో కుంటలలో చెక్ డ్యాములలో చుక్క నీరు లేకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బాలానగర్ రాజాపూర్ మండలాలలో వాగులు ఎండిపోయాయి. మూవజీవాల సైతం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు బోరుబావుల వద్దనే నీరు తాగిస్తున్నారు. కొంతమంది రైతుల విత్తనాలు సాగు చేయగా మరికొంతమంది రైతులు విత్తనాలు సాగు చేయలేక రోజు ఆకాశం వైపు ఎప్పుడు వర్షం వస్తుందో అని ఎదురు చూస్తున్నారు.



నీరు లేక వెలవెలబోయిన ముద్దాయి చెరువు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ- పెబ్బేరు



పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డ్ కు చెందిన వెంకటేష్ అనారోగ్యం తో శనివారం మరణించగా, స్థానిక కౌన్సిలర్ ఎల్లస్వామి వినతి మేరకు.. మానవతా దృక్పథం తో చలించిన ఎమ్మెల్యే తూడీ మేఘా రెడ్డి బాధిత కుటుంబానికి దశ దిన కర్మ ఖండల నిమిత్తం రూ. 5000/- (అయిదు వేలు) ఇవ్వమని ఆదేశించారు. ఆదివారం వనపర్తి బ్లాక్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సి లర్ ఎల్లస్వామి, మండల సీనియర్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి,యుగేందర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి,ఎల్లన్న తదితరులు మృతుని ఇంటికి వెళ్లి అందజేశారు.

పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి

నవతెలంగాణ - వనపర్తి రూరల్

వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పలువురు ముఖ్యులను పరామర్శించారు. డాక్టర్ వింగ్స్టన్, డాక్టర్ మురళీధర్ రెడ్డి , డాక్టర్ రమేష్ బాబు గుండె చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్లుగా మీ వైద్య సేవలు ప్రజలకు చాలా అవసరమని , మీరు త్వరగా కోలుకొని మీ సేవలు సమాజానికి అవసరమని తొందరలోనే ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరారు. అనంతరం సాక్షి రిపోర్టర్ యాసిన్ మరణించిన తర్వాత ఆయన భార్య షహనాజ్ బేగానికి డబుల్ బెడ్ రూమ్ కేటాయించారు. వారి ఆహ్వానం మేరకు మాజీమంత్రి వారి ఇంటిని ప్రారంభించారు. బీ ఆర్ ఎస్ నాయకులు సర్దార్ ఖాన్ జర్నలిస్ట్ నిరంజన్ ఇండ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీ ఆర్ ఎస్ నాయకులు ఫజల్ కుమార్తె బర్త్ డే వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆయన వెంట గట్టు యాదవ్ , వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్ , నందిమల్ల అశోక్ , చిట్యాల రాము , తోట శ్రీను తదితరులు ఉన్నారు.

నేడు బొల్లారంలో సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు

నవతెలంగాణ - వీపనగండ్ల

మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో సోమవారం మండల స్థాయి సీపీఐ(ఎం) పార్టీ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) గ్రామ కన్వీనర్ బాల గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, మండల కార్యదర్శి బాల్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఆ గ్రామాల సీపీఐ(ఎం) గ్రామ కన్వీనర్లు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు, సంఘాల ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసీని అందజేత



నవతెలంగాణ - వనపర్తి రూరల్

పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన ఈ చంద్రమ్మ భర్త పెద్ద రాముడు మూత్రపిండాలకు సంబంధించిన శస్త్ర చికిత్స కొరకు బాధిత కుటుంబ సభ్యులు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్ చిన్నారెడ్డిని సంప్రదించగా స్పందించి ప్రభుత్వం నుంచి రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసీని రాముడుకు వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో అందజేశారు.కార్యక్రమంలో గుమ్మడం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిసాన్ సెల్ మండల అధ్యక్షులు హరికుమార్ రెడ్డి , కృష్ణయ్య గోల్ల రాముడు, గజ్జల కురుమయ్య తదితరులు ఉన్నారు

ఫోన్ రికవరీ



నవతెలంగాణ -ఆత్మకూర్

ఆత్మకూరు మండలం మోట్లంపల్లి గ్రామానికి చెందిన కావాలి రాజు తండ్రి పుల్లన్న ఈ నెల జూన్ 13వ తేదీన అరేపల్లి గ్రామం నుంచి మొట్లంపల్లీ కి బైక్ పై వెళుతుండగా తన మొబైల్ ఫోన్ పడిపోయింది. వెంటనే ఆత్మకూరు పోలీసుల సహాయంతో సీఈఐఆర్ నూతన పోర్టల్ లో అప్లై చేయగా ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలోని ఆత్మకూరు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుని ఫోన్‌ను ఆదివారం అరేపల్లీ గ్రామం లో ట్రేస్ చేసి రికవరీ చేశారు. శనివారం ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ బాధితునికి మొబైల్ ఫోన్ నీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా తమ సెల్ ఫోన్ నీ ఎవరైనా దొంగిలించిన లేదా పోగొట్టుకున్నట్లయితే వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి నెంబర్ ను www.ceir.gov.in వెబ్ సైట్ లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపరచాలని అలా చేసినట్లయితే త్వరగా వారి మొబైల్స్ ని రికవరీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సీఈఐఆర్ నూతన అప్లికేషన్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భూములు కోల్పోయిన రైతులకు .. నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ



నవతెలంగాణ - వీపనగండ్ల

సింగోటం గోపాల్దిన్నె లింకు కెనాల్ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, రమేష్ , గోపాలకృష్ణ ,వంక గోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని బొల్లారంలో సింగోటం గోపాల్ దిన్నె లింక్ కెనాల్ లో రైతులు భూములు కోల్పోయిన పొలాలను, కాలువలను వారు పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ బొల్లారంలో సర్వేనెంబర్ 60 5, 60 9, 48 మంది రైతులు 52 ఎకరాల భూమిని కోల్పోయారన్నారు. రెండేళ్ల క్రితం ఉన్నప్పటి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పంటల పరిహారం పేరుతో ఎకరాకు రూ.35000 మాత్రమే ఇప్పించి ఆ తర్వాత పట్టించు కోలేదన్నారు. ఎకరాకు రూ.12 లక్షల నష్టపరిహారం ఇస్తామని చెప్పి మాట తప్పడం జరిగిందన్నారు. రెండేళ్లుగా రైతులు పొలాల్లో కాలువలతో ఉండడంతో పంటలు వేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడు రెట్లు ధర నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాలువలో భూములు కోల్పోయిన రైతులందరిని సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు ఎం, కురుమయ్య పాల్గొన్నారు.

ఆదివాసి మహిళకు నాయకుల పరామర్శ

నవతెలంగాణ - వనపర్తి రూరల్

నాగర్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొల చింతలపల్లి ఆదివాసి బాధిత మహిళను హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కమిటీ మెంబర్ జీటి శ్యామ్ వనపర్తి జిల్లా కమిటీ నాయకులు , నాగర్కర్నూల్ జిల్లా అధ్యక్షులు సాల్వా చారి ఆదివారం పరామర్శించారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమెకు భరోసా ఇచ్చార. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి ఘటన చాలా బాధాకరమని చెంచు మహిళపై జరిగిన దాష్టికాన్ని హేయమైనా అటవీక చర్యగా అభివర్ణించారు. నలుగురు వ్యక్తులు బాధిత మహిళలపై పాషావికంగా దాడీ చేసి అవమానవియంగా ప్రవర్తించారని, నిందితులకు కఠిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాదిత కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వారి ముగ్గురు ఆడపిల్లలకు ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్చుకొని విద్యాభ్యాసం చెప్పే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్ బాలము కుందం , జిల్లా ప్రధాన కార్యదర్శి గద్వాల ఆంజనేయులు , కార్యవర్గ సభ్యులు విగ్నేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- బొగ్గు బ్లాకులు వేలం వెయ్యొద్దు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్

నవ తెలంగాణ - వనపర్తి

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను రద్దు చేయాలని, బొగ్గు బ్లాకుల వేలంను వేయకుండా రద్దు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్ డిమాండ్ చేశారు . సీపీఐ(ఎం)వనపర్తి జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్ష 24 లక్షల మంది భారతీయ విద్యార్థులు పరీక్షలు రాశారని , బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బీహార్, హర్యానా తదితర రాష్ట్రాల్లోన పేపర్లు లీకయ్యాయని, ఒక్కో విద్యార్థి నుంచి రూ. 30 లక్షలు తీసుకొని పరీక్ష పరీక్షా పత్రాన్ని అమ్ముకున్నారని ఘాటుగా విమర్శించారు.



ఇంటర్మీడియట్లో పాస్ మార్కులు వచ్చిన వారికి గ్రేడ్ వన్ 720 మార్కులు వచ్చాయన్నారు. ఇది అక్రమమని పత్రికలు, పలు ప్రతిపక్ష పార్టీలు గొంతు చించుకొని అరచినా, విద్యార్థులు విద్యార్థి సంఘాలు గొల్లుమన్న కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కనీసం నోరు మెదపడం లేదని, ఇప్పటికైనా ఈ పేపర్ లీక్ పై విచారణ జరిపి తక్షణమే దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ,విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు నీట్ పరీక్ష రాయించేవాన్నారు. అలాగే నీట్ పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహించాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకులు ప్రైవేటుపరం చేస్తూ సింగరేణిని కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తున్నదని, మరోవైపు సింగరేణిని ప్రైవేటీకరించబోమని కేంద్ర బొగ్గుగనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి బుకాయిస్తున్నారని అన్నారు. బొగ్గు గనుల వేలం కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొనడం సరైంది కాదని, ఇప్పటికైనా వేలంను రద్దు చేసి సింగరేణికే కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, డీ .బాల్ రెడ్డి, ఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ కాంగ్రెస్‌కే సాధ్యం

- పాలాభిషేకం చేసిన నాయకులు



నవతెలంగాణ - మదనాపురం

ఏకకాలంలో రుణమాఫి చేయడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల నాగన్న అన్నారు. ఆదివారం మదనాపురం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జీఎంఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 47 లక్షల మంది రైతులకు 31 వేల కోట్లు వెచ్చించి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన మాటకు కట్టుబడి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రుణమాఫీ విడతలు, విడతలుగా చేసిందని, బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ రైతుల వడ్డీకే సరిపోయిందని ఎద్దేవా చేశారు. గత సర్కార్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతూ, రైతులను ఆత్మహత్యలవైపు నడిపించిందని విమర్శించారు. తమ ప్రభుత్వం దేశ చరిత్రలో మొదటిసారిగా ఏకకాలంలో మాఫీ చేయబోతున్నదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి సిద్ధమవడంతో ప్రతిపక్ష నేతలు తట్టుకోలేక పోతున్నారని, రుణమాఫీపై తప్పుడు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకోవడం సరి కాదన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జగదీష్,జిల్లా మైనారిటీ కార్యదర్శి ఖాజా మైనోద్దీన్, మాజీ ఎంపీపీ అక్కల మహదేవన్ గౌడ్,ఓబీసీ మండల అధ్యక్షులు ఆవుల రాఘవేంద్ర, నాయకులు తిరుపతి రెడ్డి,తూముVజయ్,రామకృష్ణ,శేఖర్ రెడ్డి,కురుమూర్తి, బాలస్వామి, బాను, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.అదేవిదంగా నర్సింగపురంలో గ్రామ అధ్యక్షులు కొండన్న అధ్వర్యంలో బ్రహ్మయ్య చారి,బడుగుల నాగన్న,కురుమూర్తి, రాజ్ కుమార్,విజయ్ ల అధ్వర్యంలో పాలభిషేకాలు చేశారు.

పెబ్బేరు : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు రూ.2లక్షలు ఏకకాల రుణమాఫీ ఆగస్ట్ 15 వ తేదీన అంటూ ప్రకటన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి ధన్యవాదములు తెలుపుతూ, పెబ్బేరు మండల కేంద్రంలో రైతన్నలు భారీ ఎత్తున ఎద్దుల బండ్ల ప్రదర్శన చేశారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, వ్యసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డిల చిత్ర పటలను ఊరేగించి, రైతుల పై కాంగ్రెస్ ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధి కి, ప్రతిగా సుభాష్ చౌక్ లో పాలభిషేకం చేసి, స్వీట్ లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. అనంతరం గతంలో కాంగ్రెస్ కీ. శే ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పాలనను నెమరు వేసుకుని సంబుర పడ్డారు. ఈ కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ నేతలు అక్కి శ్రీనివాస్ గౌడ్, వెంకటేసాగర్, సురేందర్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, అక్కమ్మ, గంధం రాజశేఖర్, దయాకర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.



సెంచరీ దాటిన ఎల్‌ఓసిలు

- వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి వనపర్తి ఎమ్మెల్యే
- 193 రోజులలో 105 ఎల్ ఓ సి ల పంపిణీ

నవ తెలంగాణ- వనపర్తి

సేవే పరమావధిగా భావించి ప్రతిక్షణం ప్రజల కోసం తపిస్తూ పనిచేస్తున్న మన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరుపేదల వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించి, 193 రోజుల్లో 105 ఎల్ఓసి లను బాధితులకు అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. 2023 డిసెంబర్ 9వ తేదీన వనపర్తి ఎమ్మెల్యేగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఆయన పేద ప్రజల ఇబ్బందులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అందులో అత్యవసర వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరికీ తన వంతు సహాయ సహకారం అందిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. పలు ఆసుపత్రులలో వనపర్తి నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అత్యవసర సేవలు అందించేందుకు ఒక వ్యక్తిని ఏర్పాటు చేసి ఎక్కడా వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూస్తున్నారన్నారు. నిరుపేదలైన తాము ప్రాణాపాయ స్థితిలో ఉండి ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో తమకు నేనున్నానంటూ భరోసా కల్పించి ఆసుపత్రి వర్గాలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ తానే స్వయంగా వచ్చి



పర్యవేక్షించి లక్షల విలువచేసే ఎల్ ఓ సీలను తమకు అందజేసి తమ ప్రాణాలకు తన ప్రాణాలను అడ్డువేసి కాపాడుతున్నాడన్నారు. ఇలాంటి సేవాభావం కలిగిన రాజకీయ నాయకుడు మన వనపర్తి ఎమ్మెల్యేగా రావడం మనం చేసుకున్న పూర్వజన్మ సుకృతం అని లబ్దిదారులు వనపర్తి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం ప్రజాసేవకై మాత్రమే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఎల్లవేళలా ప్రజాసేవలోనే ఉంటానని ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న నేరుగా తనను ఆశ్రయించవచ్చునని నియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పించారు.

కార్మికుల ఐక్యత కోసమే .. ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ కార్మిక బాట

- జిల్లా స్థాయి కార్మికుల సమస్యలపై చర్చ
- ఎలాంటి సమస్యనైనా ఐక్యతతో సాధిద్దాం
- ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి

నవతెలంగాణ- వనపర్తి

కార్మికుల ఐక్యత కోసం ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ కార్మిక బాట పట్టిందని ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి బుద్ధారం అన్నారు. అన్ని కార్మిక విభాగాల పాలిభాగస్వామ్యమే సమస్యల సాధనకు పరిష్కార మార్గం అని ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మిక బాట కార్యక్రమంలో భాగంగా కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని రాష్ట్ర అధ్యక్షుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయం నందిహిల్స్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన వనపర్తి జిల్లా వివిధ రంగాల కార్మిక సంఘాల అధ్యక్షులతో,నాయకులతో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా ఆయ హాజరై మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా వనపర్తి జిల్లా లో అతిపెద్ద సమస్య ఆటోనగర్ సమస్య పెద్ద ఎత్తున ఉందని, అదేవిధంగా హైదరాబాద్ స్థాయి కంటే ఎక్కువ మొత్తంలో కిరాయిలు ,వ్యాపార సముదాయాల అడ్వాన్సులు ఉన్నాయని , మెకానిక్ కార్మికుల కోసం గతంలో



ఇచ్చిన ఆటోనగర్ స్థలాన్ని మరోసారి మాకు అందజేసేలా ప్రయత్నం చేయాలని మెకానికల్ రంగ కార్మికులు కోరారు.

పాలిభాగస్వామ్యం వహిద్దాం....!

అదేవిధంగా అన్ని రంగాల కార్మికులం అందరం కలిసి బలోపేతమైతే సమస్యల పరిష్కారానికి తేలిక అవుతుందని ఇతర ఈ కార్మిక రంగానికి చెందిన వ్యక్తికి సమస్య ఏర్పడిన మిగతా కార్మిక సంఘాలు కూడా తమ వంతు సాయం అందించినట్లయితే ఓ బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశం ఉందని, మనమందరం కూడా పాళీ భాగస్వామ్యం వహించి సంఘటితమైతే స్థానిక అధికారులు సైతం స్పందిస్తారని సమస్య పరిష్కారానికి సమిష్టిగా పోరాటం చేసిన వారిగా అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సాయిబాబా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శరణ్య రెడ్డి , రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి నర్మద రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు గిరిజ, జిల్లా ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, నాగర్ కర్నూల్ జిల్లా అధ్య క్షుడు మేరావత్ లక్ష్మన్ నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, ఒగ్గు శేఖర్‌లు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ - వీపనగండ్ల

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 25న (మంగళవారం) ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, ఆప్తలామిక్ అసిస్టెంట్ మురళి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలోని గ్రామాల రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డును తమ వెంట తీసుకురావాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారిని గుర్తించి పాలమూరులోని ఏనుగొండ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

నవతెలంగాణ- మదనాపురం

మదనాపురం మండల కేంద్రములోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం కళ్యాణలక్ష్మిషాదీ ముభారక్ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు తహసీల్దార్ అబ్రహాం లింకన్ తెలిపారు. ఆదివారం విలేఖరులతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో చెక్కులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్దిదారులు కార్యాలయానికి చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నవతెలంగాణ - మదనాపురం

మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండుగను ఉద్దేశించి గ్రామస్తులు ఎడ్ల బండ్ల బిర్రు లాగుడు పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో మొదటి బహుమతి మద్దూరు రాజుకు కాంగ్రెస్ పార్టీ తరుపున రూ.10,000వేలు అందజేయగా, రెండవ బహుమతి ఉద్దోత్తుల శివకు సహస్ర మినరల్ వాటర్ యజమాని అక్కల చంద్ర శేఖర్ గౌడ్ రూ.5000లు, మూడవ బహుమతి భూపని అశోకుకుబీజేపీ నాయకులు రూ.4016లను అందించారు.అదేవిదంగా గ్రామ మాజీ సర్పంచ్ శివశంకర్, తదితర నాయకులు ఒక్కొక్కరూ చొప్పున రూ.2016లు విడివిడిగా ఇచ్చారు. అనంతరం గెలుపొందిన వారిని శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాకి పరామర్శ

నవతెలంగాణ - పెబ్బేరు

పెబ్బేరు మండలం రాంపురం గ్రామంలో బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య భార్య రాచాల పార్వతమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు.. పెబ్బేరు మండల అధ్యక్షులు వనం రాములు యాదవ్ రాంపురం గ్రామ మాజీ సర్పంచ్ బస్వరాజు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5000లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుడిసె మధు, బీఆర్ఎస్ నాయకులు గిరి, కొండలు యాదవ్, గోకారి,లక్ష్మన్న, బీసన్న, చిరంజీవి,నాగన్న యాదవ్, పుట్ట బీసన్న,రాములు యాదవ్, బీచుపల్లి యాదవ్, గోవిందు యాదవ్ పాల్గొన్నారు.

రూ.20వేల ఆర్థికసాయం

నవతెలంగాణ - మదనాపురం

మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన సీ. శేఖర్ మదనాపురంలో కార్పెంటర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని 1995-96 బ్యాచుకు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు తెలిపారు. ప్రమాదవ శాత్తు మిషన్లో చేయి ఇరుక్కోవడంతో శేఖర్‌కి తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు.శ్రమనే నమ్ముకుని బతుకుతున్న తోటి మిత్రుడు ఇబ్బందుల్లో ఉన్నాడని బావించి తోటి పూర్వ విద్యార్థులందరూ కలిసి ఆదివారం శేఖరును పరామర్శించి కుటుంబ పోషణ నిమిత్తం రూ. 20,000 వేలను అందించినట్లు తెలిపారు. తమ బ్యాచులో ఉన్న మిత్రులు అందరూ కలిసికట్టుగా తోడ్పడుకుంటు ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల మిత్ర బృందం అంబటి బాను ప్రకాష్, సురేష్, నరసింహ, వెంకటేష్, చంద్రశేఖర్, మాసన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

నవతెలంగాణ- పెబ్బేరు



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పది రోజుల క్రితం తెగిపడిన వైరును , గ్రామ సభలో సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ లో టెన్షన్ వైర్ కు విద్యుత్ సరఫరా నిలిపి వేయకపోవడంతో గొల్ల రాముడికి చెందిన రూ.70 వేల విలువజేసే గోవు కరెంట్ షాక్ తో చనిపోయిన సంఘటన మండలంలోని గుమ్మడం గ్రామంలో చోటుచేసుకుంది. పది రోజుల క్రితం తెగిపడిన లో టెన్షన్ విద్యుత్ వైర్ సమీపంలో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ పనులు నిమిత్తం రైతులు, అదే కాలిబాట వెంట నిత్యం పనుల నిమిత్తం తిరిగేవారు. సంబంధిత విద్యుత్ లైన్మెన్ దృష్టికి తీసుకువచ్చిన నిర్లక్ష్యం వహించడంతో మూగజీవి ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన విద్యుత్ సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

గృహ ప్లాటు దస్తావేజు ఒరిజినల్ మిస్సింగ్

నవతెలంగాణ-బిజినేపల్లి

మండలం బస్టాండ్ ఆవరణలో మొహమ్మద్ హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన పూల పద్మమ్మ భర్త పూల పర్వతాలు, ఎసుకని శివలీల భర్త శంకరయ్య బిజినపల్లి బస్టాండ్ ఆవరణలో గృహ ప్లాటు డాక్యుమెంట్ నెంబర్ 2042/19 ఒరిజినల్ డాక్యుమెంట్ పడిపోయినది. ఎవరికైనా దొరికితే ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు 7989917755 సమాచారం తెలుపగలరని బాధితులు కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-వంగూరు

గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ రైతులు రుణమాఫీకోసం ఎదురు చూస్తున్న తరుణంలో రైతుల అప్పుల బాధలు గుర్తించిన కాంగ్రెస్ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం పట్ల వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి కాంగ్రెస్ శ్రేణులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రకటించిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రుణమాఫీ కొరకు విధి విధానాలను ఖరారు చేయమని అధికారులను సీఎం ఆదేశించడం జరిగిన క్యాబినెట్ మీటింగులో రెండు లక్షల రుణమాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలపడం చాలా సంతోషకరమన్నారు. వేమారెడ్డి రైతులు, తదితరులు ఉన్నారు.

తండ్రి లేని బాలలను బాల సదస్సులో చేరిక



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని పెద్ద కార్పాముల గ్రామానికి చెందిన ముచ్చు చింతలయ్య రాములమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలు ముచ్చు చింతలయ్య 2022లో మరణించాడు. భర్త చనిపోవడం వల్ల రాములమ్మకు పిల్లల పోషణ, చదువు భారమై కోనేరు సంస్థ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్‌కు సమాచారం ఇవ్వగా ఆయన గ్రామానికి వెళ్లి పరిస్థితిని తెలుసుకొని, ఈ విషయాన్ని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లగా వారి ఆదేశాల మేరకు రాములమ్మ రెండవ కుమార్తె మల్లీశ్వరిని అచ్చంపేటలోని బాల సదస్సులో స్పెషల్ ఆఫీసర్ భాగ్యమ్మ సమక్షంలో చేర్పించారు. అదేవిధంగా కుమారుడు మహేష్ కూడా అచ్చంపేటలోని ఆశ్రమ పాఠశాలలో చేర్పించినట్లు కోనేరు సంస్థ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు యాదవ్ తెలిపారు.

సీపీఐ(ఎం) కార్యకర్త నడుం బిగించాలి

- సీపీఐ(ఎం) ఏపీ.మల్లయ్య, కే.వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-వంగూరు

సీపీఐ(ఎం) కార్యకర్త నడుం బిగించి బాధ్యతతో పని చేయాలని సీపీఐ(ఎం) ఏపీ.మల్లయ్య, కే.వెంకటేశ్వర్లు అన్నారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ స్థాయి సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం వంగూరు మండలంలోని జాజాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ఏపీ.మల్లయ్య, కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఐ(ఎం) కార్యకర్త నడుం బిగించి బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరు సీపీఐ(ఎం) కార్యకర్తను ఆదర్శంగా తీసుకునే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూషమోని ఆంజనేయులు, చింత ఆంజనేయులు, సీపీఐ(ఎం) వంగూరు మండల కార్యదర్శి బి.బాలస్వామి, మండల కమిటీ సభ్యులు బి.శివరాములు, లట్టుపల్లి శంకర్, పులిజాల అశోక్, బక్కయ్య, సుల్తాను, వాడాల లక్ష్మయ్య, సంధ్య, చిట్టెమ్మ, పి.శ్రీను, శ్యామలయ్య, బాలయ్య, అలవాల రాములు, రామస్వామి, ఆర్.శ్రీను, శంకరయ్య, కంబాలపల్లి మధు, బుల్లె జగన్, భోగరాజు, హుస్సేన్, భోగరాజు, జంగయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని నాయనోనిపల్లి గ్రామ శివారులో వెలసిన నాయనోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఆదివారం జరిగే మైసమ్మ దేవత జాతరకు ఈ ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుని మొక్కులు చేయించుకున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. హుండీ ఆదాయం ఒక లక్ష యాభై వేలు రూపాయలు, 60వేల మంది భక్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

బస్‌ను నడపాలని డిపో మేనేజర్‌కు వినతి



నవతెలంగాణ-వంగూరు

బస్సును నడపాలని ఆదివారం కల్వకుర్తి డిపో మేనేజర్‌కు కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. కల్వకుర్తి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు వంగూరు మండలం మీదుగా ఉమ్మాపూర్ డిండి బస్సు గత రెండు నెలలుగా నడవకపోవడం వల్ల సాధారణ ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే ఉమ్మాపూర్ డిండి బస్సును పునరుద్ధరించాలని, అనేక సంవత్సరాలుగా ఉమ్మాపూర్ డిండి బస్సు ఉదయం, సాయంత్రం వేళలో వంగూరు మండలం మీదుగా వెళ్లేదన్నారు. ఉమ్మాపూర్ డిండి బస్సు నడవకపోవడం మూలంగా విద్యార్థులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారని చాలామంది విద్యార్థులు బస్సు సౌకర్యం లేకపోవడం మూలంగా తల్లిదండ్రులు పాఠశాలలు మాన్పిస్తున్నారన్నారు. అదే విధంగా ఉమాపూర్ డిండి బస్సు నడవకపోవడం వలన దాదాపుగా 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నా రు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి వెంటనే బస్సును నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, బాలస్వామి, వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.

ఈసారీ.. ఖరీఫ్ అంతంతే..?!

- గ్రామాల్లో ఊరిస్తున్న మేఘాలు
- మొలిచి ఎండుతున్న మొలకలు
- వర్షాధార రైతుల్లో ఆందోళన
- రబీ పంటలకే సిద్ధమవుతున్న వైనం
- వాట్సప్ లోనే వర్షపు హెచ్చరికలు



నవతెలంగాణ - బల్మూరు

ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 2లక్షల 400కు పైగా ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారుల అంచనా. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, జొన్నలు, రాగులు, కందులు, ఆముదం వంటి పంటలతో పాటు వ్యాపార పంటలుగా మిర్చి, కూరగాయల పంటలు సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. గత 15 రోజుల క్రితం మండల వ్యాప్తంగా ఒకేరోజు భారీగా కురిసిన వర్షానికి మండల వ్యాప్తంగా రైతులు దుక్కులు దున్ని, మరికొందరు రైతులు విత్తనాలను కూడా వేసుకున్నారు. ఆ వర్షానికి 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. గత 15 రోజుల నుండి ఇప్పటికి వర్షం రాలేదు. దీంతో భూమిలో వేసిన విత్తనాలు మొలకెత్తి ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం మేఘాలు కమ్ముకోవడం.. వర్షం వస్తుందని ఆశించిన రైతులకు చినుకు రాలేకపోవటంతో నిరాశే ఎదురవుతుందని ఆయా గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు మేఘాలు రైతన్నలను ఊరిస్తూ దాగుడుమూతలాడుతున్నాయని వేసిన పంటలు మొలకలుగానే ఎండిపోతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికీ దాదాపుగా 1200 ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటినట్లు, 500ఎకరాలలో మక్కలు వేసినట్లు, మిగతా కూరగాయల పంటలు కూడా సాగు చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. వర్షాలు సకాలంలో కురిసినట్లయితే ఈపాటికి మక్కలు, పత్తి విత్తనాలు దాదాపుగా ఐదారు వందల ప్యాకెట్లకు మించి అమ్మే వారమని ఆగ్రోస్ రైతు సేవ విత్తన కేంద్రాల వారు అంటున్నారు. వర్షాలు లేని కారణంగా విత్తనాల కొనుగోలు కూడా రైతులు చేయడం లేదని వారు తెలిపారు. ఈ ఖరీఫ్‌లో చాలా తక్కువ విత్తనాల కొనుగోలు జరుగుతుందని, అందుకు కారణం సరైన వర్షాలు లేకపోవడమేనని తెలుపుతున్నారు. కొందరు రైతులు రబీకి సిద్ధపడే విధంగా పంటలను సాగు చేసినప్పటికీ వారి పంట మొలకలు మొలకలు గానే ఎండుతున్నాయని.. ఆయా గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. వర్షంపైనే ఆధారపడిన రైతులు సగానికి పైగా ఉన్నారని ఈ సీజన్‌లో మాత్రమే తాము పంటలు పండించుకోగలమని అలాంటి మాకు ఈ వానాకాలం కూడా నిరాశే మిగులుస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కూడా సరైన వర్షాలు లేక వానాకాలం పంటలు పండించుకోలేకపోయామని, ఈసారి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. సాగునీటి వసతి గాని, బోర్లు లేని రైతులు, బావులు లేని రైతులు గాని వర్షాధారంపైనే ఆధారపడి తమ పంటలను పండించుకోవాల్సి వస్తుందని, ఇలాంటి సమయంలో సరైన వర్షం లేక తాము ఈ సంవత్సరం కూడా పంటలను కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో ఒకసారి కురిసిన వర్షానికి మరోసారి మధ్యన వర్షం లేకపోవడంతో రబీ సీజన్‌కు ఆలస్యం అవుతుందని వానకాలం పంటలు సాగు చేయలేకపోతున్నామని, యాసంగి పంటలే మేలు అంటూ కొందరు రైతులు అభిప్రాయపడుతున్నారు.



వానాకాలం పంటలకు సరైన పదును లేకపోవడంతో వానాకాలం పంటలను బందు పెట్టుకొని నేరుగా యాసంగి పంటలకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయా గ్రామాల రైతులు తెలుపుతున్నారు. యాసంగి పంటలకు ప్రధానంగా మొక్కజొన్న, వేరుశెనగ మాత్రమే అనుకూలంగా ఉంటుందని, మిగతా ఏ పంటలకు కూడా అంత అనుకూలంగా ఉండదంటున్నారు. సరైన వర్షాలు లేనందుననే రబీ పంటలకై రైతన్నలు సిద్ధమవుతున్నారంటున్నారు. మరో రెండు రోజుల్లో వర్షాలు.. మూడు రోజులపాటు కురుస్తాయి.. నాలుగు రోజులపాటు కురుస్తాయంటూ, వాట్సప్ గ్రూపులలో వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని పెడుతున్నప్పటికీ, గత 15 రోజులుగా మండల వ్యాప్తంగా ఎక్కడ చినుకు రాలడం లేదని అంటున్నారు. వాట్సప్ గ్రూపులో వస్తున్న సమాచారం తప్పుడుదేనా అంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో వర్షాలు పడితే మన మండలానికి కూడా వర్షాలు వస్తున్నాయని గ్రూపులలో పెట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. మన మండల వాతావరణానికి సంబంధించి వర్షాలకు సంబంధించి పెట్టినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఎక్కడో వర్షాలు వస్తుంటే అక్కడి ఫోటోలను ఇక్కడ పెట్టి రైతుల్లో అనవసరపు ఆశలను కల్పించరాదని పలువురు వాట్సప్ గ్రూపుల వారికి సూచిస్తున్నారు. వర్షాలకు సంబంధించి వాతావరణానికి సంబంధించిన సమాచారాన్ని అవగాహనతో పెట్టాలని వాట్సప్ గ్రూపుల వారిని రైతులు కోరుతున్నారు. ఏది ఏమైనా జూలై 15 వరకు వర్షాలు వచ్చినట్లయితే వర్షాధారిత రైతులు మెట్ట పంటలను సాగు చేసుకోవచ్చని అప్పటి వరకైనా వర్షం సహకరించి కురుస్తుందని ఆశిద్దాం.



'ఏప్రిల్ రెండో, మూడో వారాల్లో లేదా చివరి వారంలో.. ఉరుములు, మెరుపులు వడగండ్ల వానలు.. పిడుగులు పడతాయి. గాలి వానలకు చెట్లు విరిగిపడి రేకుల షెడ్లు లేచిపోయి పిడుగుపాటుకు కొందరు మృతి చెందడం.. పశువులు మృత్యువాత పడటం పంటచేలు నేలపాలు కావడం ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడం.. లాంటి ఎన్నో సంఘటనలు ప్రధానంగా గ్రామాలలో కనిపిస్తాయి. జరిగిన జరుగుతున్న నష్టాన్ని భరిస్తూ ఆయా గ్రామాల్లో రైతులు ఈసారి ముందుగానే కాలం (వర్షాకాలం) అయితదేమో.. అంటూ చర్చించుకుంటారు. మెట్ట సాగుకు అనుకూలంగా వర్షాలు వస్తే ఈసారైనా పంటలు పండితే కొంత కష్టాలు తీరుతాయని ఆశిస్తారు. మరికొందరు ఇప్పుడు వచ్చే వానలు తప్పుడు వానలు.. ముందల మురిపిస్తాయి ఎంకసీరి.. ఎండబెడతాయి.. అంటూ విచార పోతుంటారు కొందరు. మే, జూన్ మాసాల్లో వర్షాలు మొఖం చాటేయడంతో గత రెండు, మూడేళ్లుగా ఇదే పరిస్థితి జరుగుతుందని ఈసారి కూడా ఖరీఫ్ సాగు అంతంత మాత్రమే..' అంటూ ఆయా గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్న వైనం..

మధ్యాహ్న భోజనం కార్మికులకు గుడ్ల బిల్లులు చెల్లించాలి


- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు
- నేడు అచ్చంపేట ఆర్డీఓ ఆఫీస్ ముట్టడి



నవతెలంగాణ-అచ్చంపేట

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసు లు డిమాండ్ చేశారు. లింగాల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఛలో అచ్చంపేట ఆర్డిఓ ఆఫీసు ముట్టడికి పిలుపునిచ్చారు. ఆర్డీఓ కార్యాయలం ముట్టడికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు 6 నెలల పెండింగ్ బిల్లులు, జీతాలు, కోడి గుడ్ల బిల్లులు చెల్లించాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. గత 23ఏళ్లగా పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మధ్యాహ్న భోజన కార్మికులకు అధికారం లోకొస్తే రూ.10వేలు ఇస్తామన్నారు. 8 నెలలు అవుతున్న ఇంతవరకు అమలు చేయడం లేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు పిల్లలకు గుడ్లు, కూరగాయలు వడ్డీలకు అప్పు తెచ్చి పిల్లలకు భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిలిండర్ పొయ్యి లేక కట్టెల పొయ్యి మీద వంట చేసి కళ్ళు మసకలు వాడుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సిలిండ ర్లు ఇవ్వాలని పిల్లలకు ఒక పిల్లవాని మీద పది రూపాయలు చెల్లించాలన్నారు. రేపు జరిగే ఆర్డీఓ ఆఫీసుల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల నూతన కమిటీ అధ్యక్షులుగా రాములమ్మ, కార్యదర్శి మంగమ్మ, ఉపాధ్యక్షులు సరిత, అలివేల, సహాయ కార్యదర్శిగా గోరెమ్మ, సరస్వతి, కోశాధికారి అచ్చమ్మ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మల్లేష్ ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


తెలకపల్లి..

నవతెలంగాణ - తెలకపల్లి

నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుల్ల రాజేష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన అధ్యక్షులు వారణాసి శ్రీనివాసులు, ఎంపీటీసీ ఏ.విజయలక్ష్మి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, మాజీ సర్పంచులు మాజీ ఉపసర్పంచ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందనూలు : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి జన్మదినం సందర్భంగా కొల్లాపూర్ క్రాస్‌రోడ్ దగ్గర ఉన్న ఆకారపు కుమారస్వామి చారిటబుల్ ట్రస్ట్ (శ్రీ జ్ఞానసరస్వతి వాత్సల్య మందిర్)లో అనాధ పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి, ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ సరిత, డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పిల్లలతో కలిసి భోజనం చేశారు. అన్నదాన కార్యక్రమం యూత్ కాంగ్రెస్ నాయకులు తీగల దినేష్, నాని గౌడ్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.


కందనూలు..


బిజినేపల్లి..

బిజినేపల్లి : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచ్చుకున్న రాజేష్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా కూడలిలో కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు అధ్యక్షులు మిద్దె రాములు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, బిజినపల్లి మాజీ సర్పంచ్ గంగనమోని తిరుపతయ్య, పోలేపల్లి మహేందర్, కత్తె ఈశ్వర్, బంగారు పర్వతాలు, అమృతరెడ్డి, కే.తిరుపతయ్య బోయపురం సైదులు, మాజీ సర్పంచ్ కారుకొండ బాలరాజ్, మంగి రాజు, మాజీ ఎంపీటీసీ తమ్మడి బన్నయ్య, కదిరే రాము, గౌరారం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన దుండగుల ఆస్తిని జప్తు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

మొలచింతపల్లి గ్రామ చెంచుపెంటలో నివసిస్తున్న చెంచు ఈశ్వరమ్మ అనే మహిళను అదే గ్రామానికి చెందిన కొంతమంది రాజకీయ పలుకుబడి కలిగిన ఉన్మాద వ్యక్తులు అత్యంత పాశవికంగా ఆమెపై శారీరక, మానసిక దాడిని చేసి ఆమెను తీవ్రంగా గాయపరిచిన దుండగులను వదిలిపెట్టకుండా అందరిపై భారత శిక్షా స్మృతిలో ఉన్న చట్టాలన్నీ ఉపయోగించి కఠినాతి కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి చికిత్స పొందుతున్న బాధిత మహిళను ఆయనతో పాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్ జీ, వి.వెంకటయ్య, కొల్లాపూర్ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి ఫయాజ్, సీపీఐ సభ్యులు కేశవులు గౌడ్, కొల్లాపూర్ సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, ములచింతపల్లి గ్రామ శాఖ కార్యదర్శి జంగం శివుడు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు బాలపీరు, జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ సీపీఐ బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి దుర్మార్గమైన సంఘటనలు మరోమారు జరక్కుండా ఉండాలంటే దాడికి పాల్పడిన ఎవరైతే వ్యక్తులు ఉన్నారో వాళ్లపై చట్టపరమైన చర్యలతో పాటు వాళ్ళ ఆస్తులను జప్తు చేసి బాధిత కుటుంబానికి అందించి న్యాయం చేయాలని, ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధిత కుటుంబానికి మూడు నెలల్లోగా న్యాయం చేయాలని దోషులను అందరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాల కోరారు. ప్రభుత్వం, పోలీస్ డిపార్ట్‌మెంట్ సరైన రీతిలో స్పందించి బాధిత మహిళ ఈశ్వరమ్మకు న్యాయం చేయకపోతే సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.


నాగర్‌కర్నూల్ రూరల్..


కందనూలు..

కందనూలు : జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని మొలచింతలపల్లి గ్రామస్తురాలు ఎస్టీ మహిళ చెంచు ఈశ్వరమ్మను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షులు కాళ్ల నిరంజన్ ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించి పండ్లు పంపిణీ చేశారు. ఈశ్వరమ్మపై జరిగిన దాడి పట్ల తీవ్రంగా ఖండించారు. బాధిత మహిళ పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా, మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి బాధిత మహిళలకు రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి నింధితులకు కఠిన శిక్ష వేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షులు నిరంజన్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు పబ్బతి శ్రీనివాసులు, గుర్రం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొత్తపల్లి..

పెద్దకొత్తపల్లి : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు ఈశ్వరమ్మపై దాడి హేయమైన చర్యని ఈశ్వరమ్మకు మెరుగైన చికిత్స అందించి దోషులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముచ్చ బోతు శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచు ఈశ్వరమ్మను రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జై వింధ్యాల పరామర్శించి ఆమెకు ఆ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. వీరి వెంట మహానాడు జిల్లా మారడు యాదగిరి, సలహాదారు లక్ష్మణస్వామి, జాయింట్ సెక్రెటరీ జెట్టి కురుమయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మొట్టే సుధాకర్, పౌర హక్కుల సంఘం నాయకులు ఉన్నారు.

4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నారాయణపేట-గద్వాల
సోమవారం | జూన్ 24, 2024 | www.navatelangana.com

ముఖ్యమంత్రిని కలిసిన ..
నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నవ తెలంగాణ - నారాయణపేట



నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హైదరాబాదులోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాస గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా ఆయన్ని కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా అభివృద్ధిపై కలెక్టర్‌ను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి ప్రారంభం

నవతెలంగాణ - ధరూర్



హైదరాబాదులో వేద ఆస్పత్రిని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి , ఎమ్మెల్యే తనయుడు బండ్ల సాయి సాకేత్ రెడ్డి ఆది వారం రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం గద్వాల ఎమ్మెల్యే ఆస్పత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ జీ.వేణుగోపాల, బీఆర్ఎస్ నాయ కులు శేఖర్ రెడ్డి, రాజేష్, చంద్రశేఖర్, తిమ్మారెడ్డి, కేటీదొడ్డి యూత్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డా.బీ.ఆర్..
అంబేద్కర్ యూనివర్సిటీ పరీక్షలు

- స్టడీ సెంటర్ సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి

నవతెలంగాణ - నారాయణపేట

డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ థర్డ్ ఇయర్ 6వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు స్టడీ సెంటర్ సమన్వయకర్త భాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి తప్పనిసరిగా హాల్ టికెట్, ఐడెంటిటీ కార్డు తీసుకొని రావాలని సూచించారు. డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్ 25వ తేదీ నుంచి ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మహబూబ్ నగర్ లో నిర్వహిస్తున్నట్లు స్టడీ సెంటర్ సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

అధికారులకు ప్రతిభా పురస్కారాలు



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

2024 సంవత్సరానికి పోలీస్ శాఖలోని వివిధ పోలీస్ విభాగాల విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి డీజీపీ సేవా పతకాలకు ఎంపిక చేశారు.జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి సేవ పతకాలకు ఎంపికైన అధికారులు జీ. ఈశ్వరయ్య, ఏఎస్ఐ మల్దకల్, ఎస్. రాజశేఖర్ ఏఆర్ఎస్ఐ సాయుధ దళ కార్యాలయం, పీ. వేంకటేశ్వరు హెచ్‌సీ అలం పూర్, రామి రెడ్డి హెచ్‌సీ మానవపాడ్ , ప్రభాకర్ హెచ్‌సీ స్పెషల్ బ్రాంచ్ , వై. ఎల్లశివ చారి, ఏఆర్‌హెచ్‌సీ సాయుధ దళ కార్యాలయం, టీ. శ్రీనివాసులు హెచ్‌సీ సీసీఎస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస రావు జిల్లా నుంచి సేవ పతకాలకు ఎంపికైన పోలీస్ అధికారులకు అభినంధించారు.

తారాపురంలో సందెపురాళ్ల ఎత్తే పోటీలు





గట్టు : ఏరువాక పౌర్ణమి సందర్భంగా గట్టు మండలం తారాపురం గ్రామంలో సందెపురాళ్ల ఎత్తే పోటీలు నిర్వహించారు. పోటీలో గ్రామ యువకులు పాల్గొని వారి బలాన్ని ప్రదర్శించారు. ఎనుముల రవి 82కేజీల బరువు రాయి ఎత్తి మొదటి స్థానంలో నిలిచాడు. వీరేష్ 77కేజీలు ఎత్తి రెండవ స్థానంలో నిలిచాడు. బాలు 72 కేజీల బరువు రాయి ఎత్తి మూడో స్థానంలో నిలిచాడు. బహుమతి దాతలు తారపురం మాజీ సర్పంచ్ కుమారుడు మల్లికార్జున్ గౌడ్ రూ.2016 లు మొదటి బహుమతి దాత, ఎను ముల రమేష్ రూ.1500లు రెండో బహుమతి దాత, రవి గౌడ్ రూ.1000లు మూడో బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్ల గిరక పోటీలు ప్రారంభం..

గట్టు మండలంలోని మాచర్ల గ్రామంలో ఎరువాక పండగ సందర్భంగా రెండెడ్ల బండ్ల గిరక పోటీలను నిర్వహించారు. జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ వరలక్ష్మి వెంకటస్వామిగౌడ్ హాజరై గిరిక పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతి సంవత్సరం జరిగే ఇలాంటి పండగలు మరెన్నో జరుపుకొని ఇలాంటి పోటీలను నిర్వహించుకోవడం గ్రామ ప్రజలకు, రైతులకు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు . రాబోయే రోజుల్లో ఇలాంటి ఎడ్లల పోటీ లను నిర్వహించుకుందామని ఆయన పేర్కొన్నారు . ఆయనతో పాటు గ్రామ రైతులు, కాంగ్రెస్ నాయకులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నీలహళ్లిలో బండలాగుడు పోటీలు

నవ తెలంగాణ - ధరూరు

జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూరు మండలంలోని నీలహళ్లి గ్రామంలో ఆదివారం గ్రామంలో ఏరువాక పౌర్ణమి పండగ సందర్భంగా బండ లాగుడు పోటీలు నిర్వహించారు. మీర్జాపురం రంగారెడ్డి తో పాటు గ్రామ పెద్దలు గ్రామంలో ప్రతి సవంత్సరం మాదిరిగానే గ్రామ పెద్దల సమక్షంలో ట్రాక్టర్ పోటీలు రైతులకు రైతు సంబురాలు, విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించుకోవాలని ఆర్థిక పరంగా సహాయం అందిస్తామని గ్రామస్తులంతా కలిసి కట్టుగా ఉండి సంబురాలను జరుపుకోవాలని గ్రామస్తులకు వివరించారు. దీంతో వారు గ్రామంలో పోటీలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మీర్జాపురం రంగారెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గామ పెద్దలు ఎంపిటీసీ బోయ సరోజ ఈరన్న, మాజీ ఉపసర్పంచ్ సొంటి రంగస్వామి, బోయ చిన్న హన్మంతు, చిలుక మునెప్ప, గన్‌మెన్ నర్సింహులు, బోగాని ఈరన్న, రఫీ, రాంబాబు, వినోద్, పిల్లి జుట్టు, లాలప్ప, కొత్తపాలెం సవరప్ప, శివకోటి, జగన్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



లోపించిన పారిశుద్ధ్యం

- డ్రేనేజీల్లో పేరుకుపోయిన మురుగు
- ఎక్కడబడితే అక్కడ చెత్తచెదారం
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బందుల్లో గ్రామాల ప్రజలు

గట్టు : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి దాపురించింది. సర్పంచ్‌ల పదవి కాలం పూర్తికావడంతో గ్రామానికి ఒకరి చొప్పున స్పెషల్ అధికారులను నియమించారు. స్పెషలా అధికారులు మాత్రం గ్రామాల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలోని డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని గామస్తులు అంటున్నారు. గట్టు మండలంలోని గొల్ల కందుడి గ్రామంలో ఎం పీ హెచ్ డబ్ల్యు పాఠశాల ఎదుట చుట్టుపక్కల చెత్తాచెదారంతో పాటు డ్రైనేజీ కాలువను శభ్రం చేయకపోవడంతో మురుగు నిండి దుర్వాసన వస్తుందని పాఠశాల విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు తరగతి గదుల్లోకి దుర్వాసన వస్తుందని విద్యార్థులు తెలిపారు. దీంతో మధ్యాహ్న భోజనం సమయంలో అన్నం తినడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా దుర్వాసన వెదజల్లుతుండడంతో విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కనుక స్పెషల్ అధికారి పంచాయతీ కార్యదర్శి ఒకసారి గ్రామాలలో పర్యటించి గ్రామాల్లోని చెత్తాచెదారని, డ్రైనేజీలలో మురుగును తీయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసలే వర్షాకాలం వర్షాలు కురిస్తే మరి డ్రైనేజీలు నిండి దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు లేకపోలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాల్ని సందర్శించి డ్రైనేజీలు, వార్డుల్లోని చెత్తచెదారాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.







సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ జరిపించాలి : పీవైఎల్

నవ తెలంగాణ - నారాయణపేట



నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీ పై నరేంద్ర మోడీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్, ప్రతాప్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోనీ భగత్ సింగ్ భవన్ లో పీవైఎల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీవైఎల్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు హాజరై మాట్లాడుతూ ఎంబీబీఎస్, ఇతర వైద్య, విద్య కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన నీట్- యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో నెలకొన్న అనుమానాలపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. బీహార్ లో రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాలు విక్రయించారని, ఈ వ్యవహారంలో అరెస్టులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. నీట్ పరీక్ష ఫలితాలలో 67 మందికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందని..? నీట్ పరీక్షలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి మొదటి ర్యాంకులు రావడం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని స్పష్టంగా అర్థం అవుతున్నదని అన్నారు. ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8 మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం చూస్తే బీజేపీ హయాంలో పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో స్పష్టంగా కళ్లకు కట్టినట్టుగా అర్థమవుతున్నదని అన్నారు. ఫలితాలను10 రోజుల ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించడం కూడా అనేక సందేహాలకు తావిస్తోందని అన్నారు. ఇప్పటికైనా నీట్ పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మానిటరింగ్ చేయడంలో విఫలం చెందిన కేంద్ర ప్రభుత్వం ప్రజలకు, విద్యార్థులకు సమాధానం చెప్పాలన్నారు. నీట్ నిర్వహణంలో వివాదాలు నిత్యం జరుగుతున్న నేపథ్యంలో అయా రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యార్థులు కోరుతున్నట్లు నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని , కోచింగ్ సెంటర్లు, కన్సల్టెన్సీల పేరుతో పెపర్ లీకేజీలు చేస్తున్న నీట్ కోచింగ్ సెంటర్ల అమనుమతులు రద్దు చేసి పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థులకు, దేశ ప్రజలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీవైఎల్ సంఘం ఆధ్వర్యంలో అన్ని విద్యార్థి , యువజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సలీం, ఆనంద్, కోశాధికారి రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేష్, రవి, శీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

మక్తల్ : క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి కోరారు. ఆదివారం అంత్జాతీయ ఒలంపిక్ దినోత్సవ సందర్భంగా తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్‌లోని ప్రభుత్వ క్రీడా మైదానంలో ఒలంపిక్ రన్ ను మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు ఆటల్లో సత్తా చాటి మక్తల్ కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర,జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు పథకాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రీడల జిల్లా అధికారి వెంకటేష్, పీఈటీ గోపాలం, కాంగ్రెస్ నాయకులు కోళ్ల వెంక టేష్ , గొల్లపల్లి నారాయణ , మందుల నరేందర్, నాగరాజు , బోయ నరసింహ, లొడ్డ అంజి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడికి నిరసనగా ..
రాస్తారోకో



నవ తెలంగాణ - నారాయణపేట

అల్లరిమూకలు దళిత వాడలో దళితులను బూత్‌లు తిడుతూ ఇళ్లలో దాక్కున్న కొందరిపై దాడి చేసి తలలు పగలగొట్టిన ఘటన నారాయణపేట మండలంలోని కోటకొండ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. శుక్రవారం ఏరువాక పండుగ రోజు ప్రారంభమైన వివాదం శనివారం దాడికి దారితీసింది. భయంతో కొందరు పరుగులు తీసి బీజేపీ కార్యాలయంలో దాక్కున్నారు. అక్కడికి అల్లరి మూకలు చేరుకొని బీజేపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి లోపల ఉన్న వారిని చితకబాదారు. పోలీ సులకు గ్రామస్తులు సమాచారం ఇవ్వగా ఆలస్యంగా పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇదంతా తతంగం గ్రామంలోని ఓ రాజకీయ నాయకుని ప్రోత్సలంతో అల్లరి మూకలు అల్లర్లు సృష్టిస్తున్నారని దళితులు తెలిపారు. దళితులపై అల్లరి మూకలు చేసిన దాడికి నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబే ద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దళితులపై బూత్ మాటలు తిడుతూ కులం పేరుతో దూషిస్తున్న అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని నినదించారు. భయం గుప్పెట్లో గ్రామంలో దళితులు ఉంటున్నారని అన్నారు. దళితులకు పోలీసులు అండగా ఉండాలని లేనిచో విధ్వంసానికి గురిచేస్తారని పేర్కొన్నారు. వెంటనే దళితులపై దాడి చేసిన అల్లరి మూకలను అరెస్టు చేయాలని చట్టప్రకారంగా శిక్షించాలని కోరారు.

వరుణడి కరుణ కోసం .. రైతన్నల ఎదురుచూపు

- ఎండుముఖం పడుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- రైతు భరోసా అందించాలని రైతన్నల వేడుకోలు

నవతెలంగాణ - ధరూర్



అనుకున్న సమయాన్ని కంటే ముందు నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినప్పటికీ వర్షాలు రైతులకు ఆశ చూయించి మురిపించి మొఖం చాటేశాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండలంలో వివిధ గ్రామాలలో రైతులు ఇటీవల వేసిన పంటలు వాడు ముఖం పడు తుండడంతో ప్రతిరోజు వరుణడి కరుణ కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినప్పటికీ సకాలంలో వర్షాలు వచ్చినప్పటికీ మళ్లీ వర్షం జాడ కనిపించకపోవడంతో దుక్కి దున్ని విత్తనాలు వేసే సమయంలో రైతులకు నిరాశ మిగిలింది. ఈ సారి వర్షాలు పుష్కలంగా ఉన్నప్పటికీ మొదట ఆర్భా టంగా ఎగువన కురిసిన వర్షాల వల్ల జూరాల తుంగ భద్ర, కృష్ణమ్మ లో నీటి ప్రవాహం పెరిగినప్పటికీ మళ్లీ నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం.. ఈ సంవత్సరం వర్షాలు ఆశించిన మేర ఉంటాయని ప్రకటించినప్పటికీ సకాలంలో వర్షాలు కురియకపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం నెలకొన్నది. ఒకపక్క ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు పంట రుణాల కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించకపోవడం, రైతు భరోస నిధులు కూడా సకాలంలో ఇవ్వకుండా క్యాబినెట్ సబ్ కమిటీ పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శలు వస్తున్నాయి, ఒక పక్క కౌలు రైతులు పెట్టుబడుల కోసం అప్పులు తెచ్చుకొనే పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం కౌలు రైతులకు ఏ విధంగా రైతు భరోస నిధులు చెల్లిస్తుందో స్పష్టత తెలియజేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. పట్టా భూములు కలిగిన యజమానులు కౌలు రైతు లకు పత్రాలు కానీ ఎలాంటి అప్పిడివేట్ రాయించి ఇవ్వడం లేదని పలువురు రైతులు అం టున్నారు. రెం డు లక్షల రుణమాఫీ ఆగస్టు నెలలో మాఫీ చేస్తే బ్యాంకులు ఎప్పుడు రైతులకు మళ్లీ తిరిగి రుణాలు చెల్లిస్తారో అర్థం కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రైతు భరోసా నిధులను చెల్లించాలని రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ రైతులు డిమా ండ్ చేస్తున్నారు. ప్రభుత్వం రైతు భరోస నిధు లతో పాటు రెండు లక్షల రూపాయల పంట రుణమాఫీ పథకంలో ఎలాంటి షరతులు కొర్రీలు పెట్టకుండా సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని కోరు తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయే రైతులకు ప్రభుత్వం పంట ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేసి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పట్వారి రాములు సేవలు మరువలేనివి

- ప్రొఫెసర్ కే. వై. రత్నం

నవతెలంగాణ - మరికల్



పట్వారి రాములు సేవలు మరువలేనివి అని ప్రొఫెసర్ కే. వై. రత్నం అన్నారు. ఆదివారం మరికల్ మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన పట్వారి రాములు సంస్మరణ సభ ఆదివారం ఎక్లాస్పూర్ గ్రామంలో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ,కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కే. వై. రత్నం హాజరై మాట్లాడారు. ఇంకా సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం. రాఘవచారి, సావిత్రీబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ. సరోజన, తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం ఖలీల్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు మహదేవ్, చైతన్య మహిళా సంఘం నాయకులు శ్రీదేవి, ఎరుకలి సంఘం నాయకులు పీ. నర్సింహులు, సాతీరు యాదయ్య, కుటుంబ సభ్యులు బంధుమిత్రులు వివిధ గ్రామాల ప్రజలు హాజరై నివాళులర్పించారు. అనంతరం ప్రొ.కే వై రత్నం మాట్లాడుతూ పేదల భూముల సమస్యలను నీతి నిజాయితీగా పరిష్కరించాడనీ, పట్వారి రాములు కాదు పోరాట రాములని ఆయన సేవలను కొనియాడారు. తన ఉమ్మడి కుటుంబమే కాదు తన చుట్టూ ఉన్న సమాజానికి తన ఊరుకు కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చాడని రాఘవ చారి తెలిపారు. తన కుమారుడు(బండారి లక్ష్మయ్య) ప్రజా సంఘాలలో పనిచేస్తున్నందుకు ఇన్ని కష్టాలు వచ్చాయని ఆయన ఎన్నడూ బాధపడలేదనీ ప్రజల కోసం పనిచేయడం గొప్ప విషయమేనని అనేవాడని ఎస్ఎం ఖలీల్ తెలిపారు. రాజకీయాలు నిజాయితీగా ఉండాలని, రాజకీయ నాయకులు ప్రజల సమస్యల పట్ల అంకితభావంతో పనిచే యాలన్నారు. అటువంటి నాయకులనే ప్రజలు ఎన్నుకో వాలని ఆకాంక్షించే వారని ఇంద్రవెల్లి రమేష్ మాట్లాడారు. ప్రజల ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు కావాలని ఆయన చివరి కోరికగా ఉండే దని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గురిమిల్ల రాజు పేర్కొన్నారు. తన ఉమ్మడి కుటుంబంలో చదువులకు నిలయంగా మార్చడానికి అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ఉన్నత విద్యలు అభ్యసించేలా కృషి చేశాడని శ్రీదేవి తెలిపారు. ఎక్లాస్పూర్ గ్రామ పెద్దలు మహి ళలు, వివిధ సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.